పెన్ పవర్

10 YEAR ANNIVERSARY 2014 - 2024

తెలంగాణ రౌండప్

గురువారం | 2 జనవరి 2025 | పేజీలు 8


విద్యుత్ అధికారులు సాంక్షన్ చేసిన ట్రాన్స్‌ఫార్మర్.. ఈ అక్రమ కట్టడానికే.. ఫైల్‌ఫోటో..



## విద్యుత్..! జీహెచ్ఎంసి..!

# విజిలెన్స్ ఎక్కడ..?

## రెండు రెసిడెన్షియల్ అనుమతులతో..! ఒకటే కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం..

అక్రమ నిర్మాణానికి విద్యుత్ శాఖ సాంక్షన్ చేసిన ట్రాన్స్‌ఫార్మర్..



- సంబంధిత అక్రమ నిర్మాణానికి "రోడ్డుపైనే ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్" పెట్టిన విద్యుత్ అధికారులు..
- కరెప్షన్ అధికారుల సహకారంతో నిర్మించిన అక్రమ కట్టడానికి..! విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు..
- ఆక్యుపెన్సీ లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ పెట్టొద్దని పనులు నిలిపివేసిన గతంలో డీఈ బదిలీతో..
- కొత్తగా వచ్చిన విద్యుత్ అధికారులు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై..! ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకి సహకారం..?



ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుపై ఎంత ప్రమాదకరంగా ఉందో చూడవచ్చు..

మాధవ్ పత్తి..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జనవరి 1:**

రెండు శాఖలకి చెందిన బాధ్యత గల ప్రభుత్వ అధికారులు, బాధ్యతా రాహిత్యంతో వ్యవహరిస్తున్నారు.. తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించకుండా..! ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్నారు.. ధనార్జనే ధ్యేయంగా ముడుపులు దండుకుంటూ ప్రమాదకర అక్రమ నిర్మాణాలను జీహెచ్ఎంసి ప్రోత్సహిస్తుండగా..! సంబంధిత అక్రమ కట్టడానికి, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ లేకుండానే, విద్యుత్ శాఖ కావల్సింది పుచ్చుకుని వక్రమార్గంలో ప్రైవేటు "ట్రాన్స్‌ఫార్మర్‌లను" ఏర్పాటు చేస్తున్నారు.. గతంలో ఉన్న అధికారులతో "పెన్ పవర్" ప్రతినిధి ప్రస్తావించగా, ట్రాన్స్‌ఫార్మర్‌ను పెండింగ్‌లో ఉంచినప్పటికీ..! కొత్తగా వచ్చిన డీఈ, ఏడిఈ,ఏఈ దృష్టికి తీసుకెళ్లినా..! అత్యుత్సాహంతో వ్యవహరించి ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్ పెట్టడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.. మరోవైపు విద్యుత్ విజిలెన్స్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం తీవ్ర విమర్శలు వస్తున్నాయి.. జీహెచ్ఎంసి, విద్యుత్ శాఖ అధికారుల బరితెగింపు ఒకవైపు.. ఈరెండు శాఖలపై సంబంధిత విజిలెన్స్ అధికారుల మానిటరింగ్ (పర్యవేక్షణ) లేకపోవడం.. జీహెచ్ఎంసి విద్యుత్ సంబంధిత అధికార యంత్రాంగం రెచ్చిపోతున్నారు..

-2లో



రెండు ఇంటి అనుమతులు.. కమర్షియల్ కట్టడానికి..రోడ్డుపై ట్రాన్స్‌ఫార్మర్..

- నిబంధనలతో పని లేదట..! బిల్డింగ్ ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ అవసరమే లేదట..
- ఇంటి కాంపౌండ్ లోపల పెట్టాల్సిన ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుమీద పెట్టడం విశేషం..
- విద్యుత్ శాఖ అధికారులు బరితెగించి సమాధానం.. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వైనం..
- తప్పుడు భవనానికి ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, మూడు నెలలు పెండింగ్‌లో పెట్టిన విద్యుత్ శాఖ..
- కొత్తగా వచ్చిన "డిఈ, పాత ఏడిఈ"ల కనుసన్నల్లోనే సోమవారం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు..
- జీహెచ్ఎంసిలో లంచవాతారులకు నిదర్శనమే ఈ అక్రమ నిర్మాణానికి సహకరించడం..?
- విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారుల నిర్లక్ష్యంతో..! విద్యుత్ అధికారులు ముడుపులతో ట్రాన్స్‌ఫార్మర్..?
- నిద్రావస్థలో..! అటు జీహెచ్ఎంసి విజిలెన్స్..! ఇటు విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు..
- ప్రమాదకర కట్టడాలను జీహెచ్ఎంసి ప్రోత్సహిస్తుంటే విద్యుత్ శాఖ ప్రజలను ప్రమాదంలో పడేస్తుంది..!

## అక్కడ నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేసే హక్కు ఉంది కానీ..



### కూల్చివేతలపై హైడ్రా కమిషనర్ వివరణ

- నీటి వనరుల్లోని నిర్మాణాలను నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేసే హక్కు ఉందన్న రంగనాథ్
- మానవతా దృక్పథంతో 24 గంటల గడువు ఇచ్చినట్లు వెల్లడి
- చట్టాలను పాటిస్తూ.. కోర్టు తీర్పులను గౌరవిస్తూనే ఆక్రమణలు తొలగిస్తున్నట్లు వెల్లడి

-3లో

## ఎవరెవరు ప్రజలకు దగ్గరగా ఉన్నారో వివరాలు ఉన్నాయి

### ప్రజాప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి

- ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై సూచనలు
- కొత్త సంవత్సరంలో సరికొత్త ఆలోచనలతో ముందుకు వెళదామన్న సీఎం
- స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ప్రజలకు చేరువ కావాలని సూచన

-3లో



# విద్యుత్..! జీహెచ్ఎంసి..! విజిలెన్స్ ఎక్కడ..?


పెన్ పవర్
తెలంగాణ రౌండప్
పెన్ పవర్‌కి...
బెదిరింపుల వెనుక అక్రమార్కుడు



తెలంగాణ రౌండప్ TELANGANA ROUNDUP పెన్ పవర్ 30 గురువారం, మే 2024
పెన్ పవర్ కి.. బెదిరింపుల వెనుక అక్రమార్కుడు..


తెలంగాణ రౌండప్ TELANGANA ROUNDUP పెన్ పవర్ 28 మంగళవారం, మే 2024
ఇంటి అనుమతులతో..! కమర్షియల్ కాంప్లెక్సులు..




**ఏదిఏమైనప్పటికీ సూరారం కాలనీలోని మరికొన్ని ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్‌ల సాంక్షన్, వాటి నిర్మాణాలు ఎక్కడ ఉండాలి..? నిర్మాణ దారుల కాంపౌండ్ లోపల ఉండాలా..? వెలుపలకు రోడ్లపై పెట్టవచ్చ..? అనే వియాలు విద్యుత్ విజిలెన్స్ అధికారులు విచారణ జరిపితే బావుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.. సాంక్షన్ ఉందని చెబుతున్న అధికారులు, సైట్ వెరిఫికేషన్ లేకుండానే సాంక్షన్ చేశారా..? అక్రమార్కులకు ట్రాన్స్‌ఫార్మర్ పెట్టడం ఒక్కటే లక్ష్యయమా..? నిబంధనలు జీహెచ్ఎంసి అధికారులకే కానీ, విద్యుత్ అధికారులకు ఉండవా..? ట్రాన్స్‌ఫార్మర్ పెట్టడానికి అధికారులు ఎంతకైనా బరితెగించి సమాధానం చెబుతారా..? నిర్మాణ అనుమతులు మంజూరు చేసిన టౌన్‌ప్లానింగ్ ముడుపులు పుచ్చుకుని నిబంధనలకు తిలోదకాలు.. తప్పుడు నిర్మాణానికి వక్రమార్గంలో ట్రాన్స్‌ఫార్మర్ పెట్టడంలో వీరి వాటా ఎంతో..?**

**సంబంధిత ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్‌లకు ప్రపోజల్ పెట్టేది ఎవరు..? స్థానిక ఏఈ సురేందర్ రెడ్డి సైట్ వెరిఫికేషన్‌లో ఎందుకు తిరస్కరించలేదు.. పర్మిషన్ ఉంది ఇచ్చామని అంటున్న అధికారుల లాజిక్‌గా సమాధానం చెబుతున్నారు..పర్మిషన్ సాంక్షన్‌కి పనికి వస్తుంది బాగుంది.. కానీ అదే పర్మిషన్‌లో సెట్‌బ్యాకులు కూడా ఉంటాయి అవి ఎందుకు పరిగణలోకి తీసుకోరు..? ప్రజలను ప్రమాదంలో పెట్టేందుకు తప్పుడు సాంక్షన్ ఎలా చేస్తారు..? ముడుపులే కారణమా..? విజిలెన్స్ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి సంబంధిత తప్పుడు ట్రాన్స్‌ఫార్మర్‌ను రోడ్డుపై నుండి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు..**

-

**మొదటి**

**పేజి తరువాయి**

కుత్బుల్లాపూర్ జీహెచ్ఎంసి సర్కిల్-25 పరిధిలో అక్రమ కట్టడాలకు కొదవేమిలేదు.. టిజి-బిపాస్ మున్సిపల్ చట్టప్రకారం చర్యలు, సీజింగ్‌లు కూడా..! ముడుపులు ముట్టేవరకేనని నిరూపించారు.. ఒక్క సర్కిల్-25 పరిధిలోనే వందలాది అక్రమ కట్టడాలు సాక్ష్యాలుగా ఉన్నాయి.. లేవని ఏ టౌన్‌ప్లానింగ్ అధికారి చెబుతారరో చెప్పండి చూద్దాం.. కరెప్షన్‌కి అలవాటు పడి, నిబంధనలకు తిలోదకాలు వదులుతున్నారు.. సెట్‌బ్యాకులు లేకుండా ప్రమాదకర నిర్మాణాలను ప్రోత్సహించి..! ప్రజలను రిస్కులో పెడుతున్నారు.. అగ్నిప్రమాదం సంభవిస్తే తప్పించుకునే విధంగా పర్మిషన్‌లో చూపించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు..! డబ్బుకు అమ్ముడు పోయి, లంచగొండితనానికి "బ్రాండ్ అంబాసిడర్‌గా" తయారవుతున్నారు.. వీళ్ళకు పనికిమాలిన కొందరు రాజకీయ నాయకులు తోడై వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారు.. అవినీతి నిరోధక శాఖ ఉన్నప్పటికీ, ఇలాంటి వసూల్ రాజాలపై దృష్టి పెట్టకుండా..! ఏ పార్టీ అధికారంలో ఉంటే వాళ్ళు కట్టడి చేస్తారనే విమర్శలు లేకపోలేదు..? సర్కిల్-25 పరిధి సుభాష్ నగర్ 130 డివిజన్ సూరారం కాలనీలో "రెండు రెసిడెన్షియల్ 142ం142" గజాలకు "స్టిల్ట్ం2" అనుమతులు తీసుకున్నాడు.. నిర్మాణం మాత్రం ఒకటే కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించారు.. ఈ విషయాన్ని "పెన్ పవర్" దినపత్రికలో పలుమార్లు వార్తా కథనాలు వచ్చినా..! అప్పటి ఏసిపి (అసిస్టెంట్ సిటీ ప్లానర్) సాయిబాబా, నిర్మాణ దారుని వద్ద ముడుపులు పుచ్చుకుని చర్యలు తీసుకో లేదని ఆరోపణలు వచ్చాయి.. పైగా పార్కింగ్ స్థలంలో కమర్షియల్ షెట్టర్‌లు నిర్మించినా టౌన్‌ప్లానింగ్ అధికారులు ముడుపులకే ప్రాధాన్యత ఇచ్చారు.. ఈ క్రమంలోనే 'పెన్ పవర్' ప్రతినిధికి బెదిరింపులు కూడా రావడంతో, సూరారం పోలీస్ స్టేషన్‌లో కేసునమోదు అయింది.. ఇలాంటి ప్రమాదకర తప్పుడు భవనానికి ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ లేకపోయినా..! "విద్యుత్ అధికారులు" ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్ సాంక్షన్ చేశారు..

## ట్రాన్స్‌ఫార్మర్ పెడుతున్న సమయంలో..డిఈకి ఫిర్యాదు..

ట్రాన్స్‌ఫార్మర్ సాంక్షన్ ఉందనే సాకుతో.. కాంట్రాక్టర్ స్థానిక ఏఈ, ఏడిఈ, సహకరంతో నిత్యం రద్దీగా ఉన్న సూరారం కాలనీ రోడ్డుపై, ప్రజలకు హానీతలపెట్టే విధంగా ట్రాన్స్‌ఫార్మర్ పెడుతుండగా.. అక్రమ కట్టడంపై సంబంధిత విద్యుత్ అధికారులతో "సెప్టెంబర్ 28న" పెన్ పవర్ ప్రతినిధి అక్రమ నిర్మాణంపై ప్రస్తావించగా..! అప్పట్లో విధుల్లో ఉన్న డీఈ విష్ణువర్ధన్ పనులు నిలిపివేశారు.. రెండు నెలల క్రితం కొత్తగా మరోక అధికారి డిఈ శ్రీనివాస్ విధుల్లో చేరారు.. కొత్తగా వచ్చిన డీఈ శ్రీనివాస్‌తోనూ అక్రమ నిర్మాణం గురించి వివరించి నప్పటికీ..! ఏమేరకు ముడుపులు స్వీకరించారో కానీ..? గత సోమవారం (డిసెంబర్ 30న) సాయంకాలానికి ట్రాన్స్‌ఫార్మర్ నిలబెట్టి కనెక్షన్ ఇచ్చారు..

## ఇల్లీగల్‌తో సంబంధం లేదు.. పర్మిషన్ ఉంటే చాలు: ఏడిఈ వీరేశలింగం..

ఏఈ సురేందర్ రెడ్డి పొంతన లేని సమాధానం చెప్పాడంటే.. ఏడిఈ వీరేశలింగం మరీ విడ్డూరంగా సమాధానం చెబుతున్నారు.. సంబంధిత కాంట్రాక్టర్ ఏ మేరకు ప్రలోభాలకు పెట్టాడోకానీ..! విద్యుత్ అధికారుల సమాధానం అవగాహన లేమితో చెబుతున్నారని స్పష్టమవుతుంది.. ఏఈ,ఏడిఈ సమాధానం, అక్రమ నిర్మాణదారుడికి, కాంట్రాక్టర్‌కి అనుకూలంగా ఉందని తెలుస్తోంది.. అక్రమ నిర్మాణం విషయం జీహెచ్ఎంసి చూసుకుంటుంది.. మాకు నిర్మాణ అనుమతులు ఉంటే చాలని, ఏడిఈ తేలికగా సమాధానం చెప్పడం గమనార్హం.. డీవియేషన్, కమర్షియల్ కట్టడం సంబంధిత విషయాలు జీహెచ్ఎంసి అధికారులను ప్రశ్నించాలని..! సెట్‌బ్యాకులు లేని అక్రమ కట్టడంలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే..! అన్న ప్రశ్నకు, ఫైర్ వాళ్ళు చూసుకుంటారని "ఏడిఈ" హాస్యాస్పదంగా సమాధానం చెప్పడం గమనార్హం.. ఇంత చెబుతున్న అధికారులు అసలు విషయాన్ని మరిచారో ఏమో.. ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్‌ను, సంబంధిత బిల్డింగ్ ఆవరణలోనే పెట్టాలి మరి రద్దీగా ఉండే రోడ్లపై కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఎలా పెడతారో చెబితే బాగుంటుంది..

## విద్యుత్ అధికారుల పొంతన లేని సమాధానం..

ఈ విషయంపై సంబంధిత ఏఈ సురేందర్ రెడ్డిని ప్రశ్నించగా పొంతనలేని సమాధానం ఇచ్చారు.. ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్ సంబంధిత వ్యక్తుల కాంపౌండ్‌లోనే పెట్టాలనే అవగాహన లెదా..? లేక వేరే ఏదైన ప్రలోభాలకు తలొగ్గారో ఏమోకానీ..! ఐదంస్తులు ఉంటేనే ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ అవసరమని ఏఈ సురేందర్ రెడ్డి చెప్పడం గమనార్హం.. మెయిన్ రోడ్లపైనే ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్‌లు పెట్టమని ఏ చట్టంలో ఉందో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు తేల్చాలి.. ప్రజల ప్రాణాలకి హానీతలపెట్టే విధంగా విద్యుత్ అధికారులు వ్యవహరించడంపై..! విద్యుత్ విజిలెన్స్ అధికారులు దృష్టి సారించాలి.. ఏఈ సురేందర్ రెడ్డి మాత్రం అక్రమ నిర్మాణంతో సంబంధం లేదు, ఆక్యుపెన్సీ లేకపోయినా ట్రాన్స్‌ఫార్మర్ పెట్టొచ్చుని, అవసరమైతే ఏడిఈ సారును అడగమని చెప్పడం మరింత అనుమానాలకు తావిస్తోంది..

## ఎవరెవరు ప్రజలకు దగ్గరగా ఉన్నారో వివరాలు ఉన్నాయి

**హైదరాబాద్ పెన్ పవర్:**ఎవరెవరు ప్రజలకు దగ్గరగా ఉన్నారో తన వద్ద వివరాలు ఉన్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా తనను కలిసేందుకు వచ్చి శుభాకాంక్షలు చెబుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు ఆయన దిశా నిర్దేశనం చేశారు. వారితో కాసేపు ప్రభుత్వం, పార్టీ గురించి మాట్లాడారు.ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంపై ఆయన సూచనలు చేశారు. కొత్త సంవత్సరంలో సరికొత్త ఆలోచనలతో ముందుకు వెళదామన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు దగ్గరగా ఉండాలన్నారు. ప్రజలతో మంచి సంబంధాలు కలిగి ఉండాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ప్రజలకు చేరువ కావాలన్నారు. ఈరోజు నుంచి ప్రజాప్రతినిధులతో మాట్లాడతానని... ఎవరెవరు ప్రజలకు దగ్గరగా ఉన్నారో తెలుసన్నారు.

## అక్కడ నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేసే హక్కు ఉంది కానీ..

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వివరణ ఇచ్చారు. నిన్న ఉదయం ఖాజాగూడ భగీరథమ్మ చెరువు వద్ద హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ఇక్కడి ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై వివరణ ఇచ్చారు. తాము నిబంధనలు పాటిస్తూనే అక్రమ నిర్మాణాలను కూల్చివేశామన్నారు.

నీటి వనరుల్లోని నిర్మాణాలను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేసే హక్కు ఉందన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ కూడా ఇదే అంశంపై తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు ఇచ్చిందన్నారు. చట్టాలను పాటిస్తూనే... కోర్టులను గౌరవిస్తూనే తాము ఆక్రమణలను తొలగిస్తున్నామన్నారు.బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లోని నిర్మాణాలనే తొలగించామని రంగనాథ్ వెల్లడించారు. నోటీసులు ఇవ్వకుండానే కూల్చవచ్చని... కానీ మానవతా దృక్పథంతో ఇరవై నాలుగు గంటల్లో ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. నోటీసులు ఇచ్చాక కూడా 24 గంటల్లో ఖాళీ చేయనందునే కూల్చివేశామన్నారు.

ఖాజాగూడలోని బ్రాహ్మణకుంట ప్రాంతంలో ఆక్రమణల తొలగింపులో హైడ్రా వ్యవహరించిన తీరుపై హైకోర్టు మంగళవారం నాడు ఆగ్రహం వ్యక్తం చేసింది. నోటీసులు ఇచ్చి ఇరవై నాలుగు గంటలు కూడా గడవకముందే ఎలా కూల్చివేస్తారని ప్రశ్నించింది. ఇలాగే చేస్తే హైడ్రా కమిషనర్‌ను కోర్టుకు పిలవాల్సి ఉంటుందని హెచ్చరించింది. హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ వివరణ ఇచ్చారు.

### ఫార్ములా ఈ రేసులో రిజర్వు బ్యాంకు అనుమతులు లేకుండా ఎలా చెల్లింపులు చేశారు

**హైదరాబాద్ పెన్ పవర్:**ఫార్ములా ఈ వ్యవహారంలో రిజర్వు బ్యాంకు అనుమతి లేకుండా నిధులు ఎలా చెల్లింపు చేశారని ఏజీ సుదర్శన్ రెడ్డి ప్రశ్నించారు. రిజర్వ్ బ్యాంకు అనుమతి లేకుండా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) ద్వారా నేరుగా విదేశీ సంస్థలకు డబ్బులు చెల్లింపులు కూడా చట్ట వ్యతిరేకమని ఏజీ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. విదేశీ సంస్థకు నగదు చెల్లించిన ఫలితంగా ఇన్‌కంట్యాక్స్ కింద రూ.14 కోట్లు అదనపు భారం పడిందని చెప్పారు. ఫార్ములా%-% ఈ రేసింగ్ నిర్వహించడం వల్ల ప్రభుత్వానికి ప్రయోజనమేమీ లేదని, స్పాన్సరర్‌కే లాభాలు వచ్చాయని చెప్పారు. నిందితుల జాబితాలో ఫార్ములా %-%ఈ సంస్థను ఎందుకు చేర్చలేదని పిటిషనర్ ప్రశ్నించడం ద్వారా కేసు నుంచి ఏదో విధంగా తప్పించుకునే తపన కనబడుతున్నదని అన్నారు.ఫార్ములా%-% ఈ రేస్ కంపెనీ ఇంగ్లండ్‌కు చెందినదని, అన్ని అంశాలను పరిశీలించాకే కేసు నమోదు చేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చిందని, ఈ క్రమంలోనే ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం జరిగిందని తెలిపారు. దర్యాప్తులో తేలిన సమాచారం ఆధారంగా కొత్తగా నిందితులను చేర్చడం, అవసరమైతే ఉన్న వాళ్లను తొలగింపునకు వీలుంటుందని చెప్పారు.

# కేసీఆర్ సారు బయటికి రారా? యాక్టివ్ పాలిటిక్స్ నుంచి తప్పుకున్నట్టేనా?

- ఈ ఏడాది బీఆర్ఎస్ కు కొత్త ప్రెసిడెంట్!
- ఇటీవలే చిట్ చాట్ లో చెప్పిన కేటీఆర్
- ఫ్యామిలీ మెంబర్ కే పగ్గాలు అప్పగిస్తారా..?
- రేసులో కేటీఆర్, హరీశ్, కవిత ఉన్నారని టాక్
- ఎస్సీ లేదా, బీసీకి బాధ్యతలిస్తారని చర్చ
- ఆర్ఎస్ ప్రవీణ్ కు అప్పగిస్తారని మరో చర్చ




**హైదరాబాద్ పెన్ పవర్:**పదేండ్లు రాష్ట్రాన్ని పాలించిన గులాబీ బాస్ యాక్టివ్ పాలిటిక్స్ నుంచి తప్పుకుంటున్నట్టేనా..? ఆయనికి బయటికి రారా..? పార్టీ పగ్గాలను ఇతరులకు అప్పగిస్తారా..? అనే ది రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఇటీవల మీడియాతో చిట్ చాట్ చేసిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. 2025లో బీఆర్ఎస్ కు కొత్త ప్రెసిడెంట్ రాబోతున్నారంటూ చెప్పారు. పార్టీ ఆవిర్భావం నుంచి అధ్యక్షుడిగా కొనసాగిన కేసీఆర్ ఇక క్రియాశీలక రాజకీయాలకు దూరమవుతారా..? అనే చర్చ మొదలైంది. అయితే పార్టీ పగ్గాలను ఇతరులకు ఇవ్వరని కుటుంబ సభ్యులకే అప్పగిస్తారనే టాక్ ఉంది. ఈ నేపథ్యంలో కేటీఆర్ కే పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తారని, వర్కింగ్ ప్రెసిడెంట్ గా కవిత లేదా హరీశ్ కు అప్పగించే అవకాశం ఉందని తెలుస్తోంది.


మాజీ మంత్రి హరీశ్ రావు, ఎమ్మెల్సీ కవిత ప్రస్తుతం పార్టీలో యాక్టివ్ గా ఉంటున్నారు. ఎప్పటికప్పుడు ఆందోళనలు, నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. తాము అధ్యక్ష రేసులో ఉన్నామనే సంకేతాలు ఇస్తున్నారా..? అనే చర్చ కూడా కొనసాగుతోంది. ఇదిలా ఉండగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా దళితుడిని చేస్తానని గతంలో మాట ఇచ్చిన కేసీఆర్ ఆ హామీని నెరవేర్చుకునేందుకు పార్టీ అధ్యక్ష బాధ్యతలను ఎస్సీ నేతకే ఇస్తారనే టాక్ కూడా వస్తోంది. ఈ క్రమంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు పార్టీ పగ్గాలు అప్పగిస్తే ఎలా ఉంటుందనే చర్చ కూడా కొనసాగుతోంది.

ఇదిలా ఉండగా బీసీ నినాదంతో రేవంత్ సర్కార్ దూకుడుగా వెళ్తోంది. ఓ వైపు కుల గణన.. బీసీలకు రాజకీయాల్లో రిజర్వేషన్లను పైకెత్తుకుంది. దీంతో ఎమ్మెల్సీ కవిత బీసీల జపం మొదలు పెట్టారు. అటు బీజేపీ కూడా బీసీ సీఎం నినాదం వినిపిస్తోంది. వచ్చే ఎన్నికల్లో బీసీలు నిర్ణయాత్మకశక్తిగా మారుతారనే టాక్ కూడా బలంగా వస్తోంది. దీంతో బీసీ నేతకు బీఆర్ఎస్ అప్పగిస్తారనే మరో చర్చ కూడా మొదలైంది. పార్టీ అధ్యక్షుడిగా ఫ్యామిలీ మెంబర్ ను కాకుండా ఇతరులకు అప్పగిస్తే.. కుటుంబంలో జరుగుతున్న అంతర్గత కలహాలకు చెక్ పడుతుందని, దీనివల్ల కేటీఆర్, కవిత, హరీష్‌రావు ఒకే తాటి మీదకు వస్తారని పార్టీ నేతలు చెబుతున్నారు.

దాదాపు పాతికేళ్ల తర్వాత

2001 ఏప్రిల్ 27న పురుడు పోసుకున్న తెలంగాణ రాష్ట్ర సమితికి దాదాపు పాతికేళ్ల తర్వాత అధ్యక్షుడి మార్పుపై చర్చ మొదలైంది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆవిర్భవించిన టీఆర్ఎస్ అదే పేరుతో ఐదేండ్లు రాష్ట్రాన్ని పాలిచింది. రెండో సారి కూడా టీఆర్ఎస్ పేరుతోనే అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇవ్వాలన్న కేసీఆర్ ఆలోచనతో భారత రాష్ట్ర సమితిగా మారిపోయింది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయింది. అప్పటి నుంచి బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ క్రియాశీల రాజకీయాల్లోకి రావడం లేదు. ఫాంహౌస్ కే పరిమితమయ్యారు. అసెంబ్లీకి కూడా రాకపోవడాన్ని అధికార పార్టీ పదే పదే తప్పు పడుతూ వస్తోంది. ఈ తరుణంలో పార్టీకి కొత్త అధ్యక్షుడి నియామకం అంశం తెరమీదకు రావడంతో కేసీఆర్ యాక్టివ్ పాలిటిక్స్ నుంచి తప్పుకొన్నట్టేనా..? అన్నది హాట్ టాపిక్ గా మారింది.

# హైదరాబాద్ అయ్యప్ప సొసైటీలోని ఆఫీస్‌లో భారీ అగ్నిప్రమాదం



**హైదరాబాద్ పెన్ పవర్:**మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో ఉన్న ఒక ప్రైవేట్ కంపెనీలో అగ్నిప్రమాదం జరిగింది. 100 ఫీట్ రోడ్ %హా=% విగ్రహం దగ్గర ప్రైవేట్ కంపెనీలోని యూపీఎస్‌లో ఒక్కసారిగా మంటలొచ్చాయి. ఉద్యోగుల అలర్ట్ కావడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ అగ్ని ప్రమాదానికి సంబంధించి ఫైర్ డిపార్ట్ మెంట్ కు వెంటనే సమాచారం అందించారు. రెండు ఫైర్ ఇంజిన్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. స్వల్ప ఆస్తి నష్టం వాటిల్లింది. 2024, జనవరి 1న సాయంత్రం ఈ ఘటన జరిగింది.

న్యూ ఇయర్ కావడం, కొందరు ఉద్యోగులు అప్పటికే వర్క్ ముగించుకుని వెళ్లిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. హైటెక్ సిటీకి కూతవేటు దూరంలోనే అయ్యప్ప సొసైటీ ఉంటుంది. అయ్యప్ప సొసైటీ ఏరియాలో ఐటీ రిక్రూటింగ్ కంపెనీలు ఎక్కువగా ఉన్నాయి. హైదరాబాద్ సిటీలోనే ఇది వన్ ఆఫ్ ది కాస్ట్‌లీ ఏరియా. విప్రో జంక్షన్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రాం గూడ, బయోడైవర్సిటీ జంక్షన్, రాయదుర్గం నాలెడ్జ్ సిటీ, మైండ్‌స్పేస్ జంక్షన్లకు అయ్యప్ప సొసైటీ దగ్గరగా ఉంటుంది. ఐటీ ఉద్యోగులు, కంపెనీ ప్రతినిధులు ఉండే కాలనీల్లో అయ్యప్ప సొసైటీ కూడా ఒకటి.

ఇదిలా ఉండగా.. నూతన సంవత్సర వేడుకల కోసం పిండి వంటలు చేసే క్రమంలో గ్యాస్ సిలిండర్ లీక్ కావడంతో కొండాపూర్‌లోని గెలాక్సీ అపార్ట్మెంట్ లో అగ్ని ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఇంట్లో ఉన్న ఫ్రిజ్, వాషింగ్ మెషిన్, ఏసీలు, బెడ్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, గీజర్ కాలి బూడిదయ్యాయి. మంటల కారణంగా అపార్ట్మెంట్ మొత్తం దట్టమైన పొగ అలుముకుంది. ఈ పొగ కారణంగా ఇబ్బంది పడుతూ మిగిలిన ఫ్లాట్లలో చిక్కుకున్న దాదాపు 10 మందిని అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. అగ్ని ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. భారీగా ఆస్తి నష్టం మాత్రం జరిగింది.

## నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతూ సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన ట్వీట్ చేశారు. 2025 కొత్త ఏడాది నేపథ్యంలో రాజకీయ ప్రముఖులు శుభాకాంక్షలు చెబుతున్నారు. నవ వసంతంలో విశ్వ వేదికపై విజయ గీతికగా తెలంగాణ స్థానం... ప్రస్థానం ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితంలో ఈ నూతన సంవత్సరం శుభ సంతోషాలను నింపాలని, మనసారా కోరుకుంటూ అందరికీ 2025 కొత్త సంవత్సర శుభాకాంక్షలు అంటూ రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి తదితరులు కూడా కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలా ఉండగా, సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 21 నుంచి దావోస్‌లో పర్యటించనున్నారు. అంతకంటే ముందు జనవరి 13 నుంచి 15 వరకు ఆస్ట్రేలియాలో, జనవరి 19 నుంచి 21 వరకు సింగపూర్‌లో పర్యటించనున్నారు.

## కేసీఆర్ నాయకత్వంలో పార్టీ మరిన్ని విజయాలు అందుకోవాలి: కేటీఆర్




హైదరాబాద్ పెన్ పవర్: కేసీఆర్ నాయకత్వంలో పార్టీ మరిన్ని విజయాలు అందుకోవాలని, ప్రజల ఆశీస్సులు తిరిగి పూర్తిస్థాయిలో పొందాలని, కొత్త సంవత్సరంలో మనకు ఎదురయ్యే అడ్డంకులు ఎదుర్కొనే శక్తిని ఆ భగవంతుడు ఇవ్వాలని ఆకాంక్షిస్తున్నానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నూతన సంవత్సరం నేపథ్యంలో ఆయన ఈరోజు తెలంగాణ భవన్‌కు వచ్చారు. పార్టీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులను, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... కేసీఆర్ చావు నోట్లో తలపెట్టి తెలంగాణ సాధించిన నాయకుడు అన్నారు. మనందరం మనస్ఫూర్తిగా కాంక్షిస్తున్నది ఒక్కటేనని... కేసీఆర్ తిరిగి రాష్ట్రానికి సీఎం కావాలనే ఒకే ఒక్క కోరికతో గట్టిగా పని చేస్తున్నామన్నారు.

ఈ ప్రయాణంలో మనకు ఎదురయ్యే అడ్డంకులు ఎదుర్కొనే శక్తి భగవంతుడు అందరికీ ప్రసాదించాలని పేర్కొన్నారు. అందరూ వారి వారి కుటుంబాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కులమతాలకు అతీతంగా, ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ దేశం, రాష్ట్రం ప్రశాంతంగా ఉండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు.

# టీమిండియా 9 మందితోనే ఆడుతోంది.. ఈ మాటంటే వారిద్దరి అభిమానులు ఓర్చుకోలేరు: సీవీ ఆనంద్

హైదరాబాద్ పెన్ పవర్:బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో టీమిండియా వెనుకబడిన విషయం తెలిసిందే. పెర్త్ గడ్డపై విజయం సాధించి టెస్ట్ సిరీస్‌ను ఘనంగా ఆరంభించినా.. ఆ తరువాత రెండింట ఓడి ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో 2-1 తేడాతో వెనుకబడింది. ప్రస్తుత భారత జట్టులో అతి పెద్ద సమస్య.. సీనియర్లు రాణించకపోవడం. ఈనేపథ్యంలో టీమిండియా ఓటములపై కొందరు నెటిజన్లు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్‌కు కొన్ని ప్రశ్నలు సంధించగా.. ఆయన నిర్మొహమాటంగా సమాధానాలు ఇచ్చారు.





**ఆ ఇద్దరి ఆర్మీలు నన్ను ట్రోల్ చేస్తాయి..: సీవీ ఆనంద్**

ప్రత్యర్థి జట్టు 11 మందితో ఆడుతుంటే భారత జట్టు 9 మందితోనే ఆడుతుందని సీవీ ఆనంద్ సెటైర్లు వేశారు. జట్టులో మరో ఇద్దరు ఉన్నా.. లేనట్టే అని ఆయన మాటలను బట్టి అర్థమవుతోంది. ఆ ఇద్దరు మరెవరో కాదు.. రోహిత్, కోహ్లీలే. ఈ మాటంటే వీరి అభిమానులకు ఎక్కడలేని కోపం పొడుచుకొస్తుందని సీవీ ఆనంద్ చెప్పుకొచ్చారు. వారి సోషల్ మీడియా ఆర్మీలు వ్యక్తిగతంగా ట్రోలింగ్‌కు దిగుతాయని అన్నారు. అందువల్ల వీరి పేర్లను ఆయన ప్రత్యక్షంగా ప్రస్తావించలేదు. అగ్రశ్రేణి జట్ల చేతిలో టీమిండియా పదే పదే ఓడిపోతున్న విషయాన్ని సీవీ ఆనంద్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. గత ఆసీస్ పర్యటనలో కుర్రాళ్లతో టీమిండియా విజయం సాధిస్తే.. ఇప్పుడు జట్టులో పేరు మోసిన ఆటగాళ్లున్నా పొడిచింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. ఓ అభిమానిగా ఈ ఓటములను జీర్ణించుకోవడం చాలా కష్టంగా ఉందని అన్నారు. స్టార్ ఆటగాళ్లంటే జట్టుకు అవసరమైనప్పుడు మంచి ప్రదర్శన చేసి అభిమానుల్లో తమ ఆదరణ తగ్గకుండా చూసుకోవాలని మరో ప్రశ్నకు సీవీ ఆనంద్ బదులిచ్చారు.సీవీ ఆనంద్ మాటల్లో వాస్తవం లేకపోలేదు. కెప్టెన్ రోహిత్ శర్మ, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ జట్టులో ఉన్నారన్న పేరు తప్ప.. ఆటలో వారి పాత్ర శూన్యం. సిరీస్ ఏదైనా.. ప్రత్యర్థి ఎవరైనా భాధ్యతారాహిత్యంగా ఆటాడుతు న్నారు. ఓ వైపు అదే పిచ్‌లపై జూనియర్లు సెంచరీల మీద సెంచరీలు బాదేస్తున్నా.. వీరు మాత్రం క్రీజులో పట్టుమని పది నిమిషాలు కూడా నిలదొక్కుకోలేకపోతున్నారు. వీరు రాణించకపోవటం టీమిండియాను బాగా దెబ్బతీస్తోంది.

# జనవరి 11న హైమన్ డార్ఫ్ దంపతుల వర్ధంతి పోస్టర్ రిలీజ్ : ఎవరీయన.. నాగోబా జాతరతో సంబంధం ఏంటీ..?

హైదరాబాద్ పెన్ పవర్:ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీలు జనవరి 11న హైమన్ డార్ఫ్ దంపతుల వర్ధంతిని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ ఎత్తున ఆదివాసీలు తరలివచ్చి హైమన్ డార్ఫ్ దంపతుల 36 వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఆదిలాబాద్ జిల్లా జైనూర్ లో బుధవారం (జనవరి1,2025) పోస్టర్ ను రిలీజ్ చేశారు. ఇంతకీ ఎవరీ హైమన్ డార్ఫ్ దంపతులు..ఎందుకు ఆదివాసీలు వీరి జయంతి, వర్ధంతిలను ఘనంగా నిర్వహిస్తున్నారు.. ఏటా వీరిని ఎందుకు స్మరించుకుంటున్నారు..? నాగోబా జాతరకు, ఈ హైమన్ డార్ఫ్ దంపతులు సంబంధం ఏంటీ..? నాగో బా జాతర దర్బార్ కు ఉన్న అనుబంధం ఎలాంటిది? హైమన్ డార్ఫ్ దంపతులు ఆస్ట్రియా దేశానికి చెందిన వారు.. లండన్ విశ్వ విద్యాలయంలో మానవ పరిణామ శాస్త్రంలో డాక్టరేట్ పట్టా పొందినవారు. నేపాల్, ఫిలిప్పీన్స్, భారత్ వంటి దేశాల్లో ఆదివాసీల జీవన విధానంపై అధ్యయనం చేసిన గొప్ప మానవతా వాదులు.







**ఆదిలాబాద్ ఆదివాసీలకు.. హైమన్ డార్ఫ్ దంపతులకు లింకేంటీ..**

భారత దేశానికి స్వాతంత్ర్యం రాకముందు తెలంగాణలోని ఓ ప్రాంతమైన ఆదిలాబాద్ జిల్లా నిజాం పాలనలో ఉండేది..ఆదివాసీలు నివసిస్తున్న తండాలు, గూడేలకు, గ్రామాలకు కనీస సౌకర్యాలు లేకుండా ఉండేవి. ఆదివాసీలు అనేక ఇబ్బందులు పడుతున్న రోజులవి..మరోవైపు స్వాతంత్ర్య పోరాటం జోరుగా సాగుతున్న రోజులవి.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఆదిలాబాద్ జిల్లా వాసీ..ఆదివాసీ బిడ్డ, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డికొమురయ్య పోరాటం మొదలు పెట్టి తొలి అమరుడయ్యారు. ఆ క్రమంలో నిజాం గుండెల్లో వణుకు పుట్టింది.. ఆదివాసీల సమస్యలపై దృష్టి సారించిన నిజాం.. ఆదివాసీల జీవన విధానంపై అధ్యయనం చేసేందుకు హైమన్ డార్ఫ్ దంపతుల ఆదిలాబాద్ ఆదివాసీలు నివసించే ప్రాంతానికి పంపించారు.

**నాగోబా జాతరకు,దర్బార్ కు.. హైమన్ డార్ఫ్ దంపతులకు మధ్య అనుబంధం**

ఆదివాసీల జీవన విధానంపై అధ్యయనం చేస్తున్న హైమన్ డార్ఫ్ దంపతులను నాగోబా జాతర బాగా ఆకర్షించింది.. భారత దేశ వ్యాప్తంగా ఉన్న ఆదివాసీలు నాగోబా జాతరకు రావడం,.. మహాసమ్మేళనంగా పాల్గొనడం, ఆదివాసీల సంస్కృతి, సాంప్రదాయాలను బాగా ఆకట్టుకున్నాయి. అదే సమయంలో ఆదివాసీల సమస్యలపై నా దృష్టి పెట్టారు హైమన్ డార్ఫ్ దంపతులు. నాగో బా జాతర సందర్భంగా గుమికూడిన ఆదివాసీల సమస్యలు తెలుసుకునేందుకు జాతర చివరి రోజున వారితో సమావేశం నిర్వహించేవారు..అదే దర్బార్.. ఈ దర్బార్ లో ఆదివాసీలను సమస్యలను తెలుసుకొని నిజాం ప్రభువుకు అందించేవారు.

అప్పటినుంచి ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన దేవునిగా చూసేవారు ఆదివాసీలు.. ప్రతియేటా వారి జయంతి, వర్ధంతిలను నిర్వహిస్తుంటారు. ఈ యేదాది కూడా జనవరి 11న హైమర్ డార్ఫ్ దంపతుల వర్ధంతిని నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేశారు ఆదివాసీలు.

# న్యూ ఇయర్ సందర్భంగా ఇలాంటి తిండి తిన్నామా.. హైద్రాబాద్ రెస్టారెంట్లలో అధ్వాన్న పరిస్థితులు



**హైదరాబాద్ పెన్ పవర్:**అసలే న్యూ ఇయర్.. హోటల్స్ కు ఫుల్ డిమాండ్.. బిర్యానీలకు ఫుల్ ఆర్డర్స్.. ఎంత కమాయించుకుంటే అంత.. ఏది పెట్టినా తింటారులే అనుకున్నారేమో. స్వచ్ఛత, పరిశుభ్రత పాటించుకోకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారులు చెబుతున్నా.. హోటల్స్ నిర్వాహకుల తీరు మారటం లేదు. న్యూ ఇయర్ సందర్భంగా హైద్రాబాద్ కొంపల్లిలోని హోటల్స్ లో తనిఖీలు నిర్వహించారు ఫుడ్ సేఫ్టీ అధికారులు. కొంపల్లిలోని ఉలవచారు, మల్నాడు కిచెన్, ట్రైన్ థీమ్ రెస్టారెంట్ లలో వరుస దాడులు చేసి తనిఖీలు నిర్వహించారు. అపరిశుభ్రమైన కిచెన్ పరిసరాలను చూసి అధికారులు షాకయ్యారు.

నాన్ వెజ్ ఐటమ్స్ లో సింథటిక్ ఫుడ్ కలర్స్ కలిపినట్టు గుర్తించారు. అదేవిధంగా కుళ్లిపోయిన టమాటాలు వాడుతున్నట్లు అధికారులు గుర్తించారు. కిచెన్ పరిసరాలు పూర్తిగా అపరిశుభ్రంగా ఉన్నాయని ఫుడ్ సేఫ్టీ అధికారులు తెలిపారు. వంట గదులు పూర్తి అపరిభ్రంగా ఉన్నాయని.. కిచెన్ లో బొద్దింకలు ఉన్నట్టు అధికారులు తెలిపారు. కాలం చెల్లిన వంట సామాగ్రి వాడుతున్నట్లు గుర్తించారు. అదే విధంగా వెజ్, నాన్ వెజ్ ఒకే ఫ్రిజ్లో స్టోర్ చేసి వాడుతున్నట్లు బయటపడింది. వెజ్ నాన్ వెజ్ ఐటమ్స్ కు బటర్ అప్లై చేయడానికి రెస్టారెంట్లలో పెయింటింగ్ బ్రష్ వాడుతున్నట్లు కనిపెట్టారు. తుప్పు పట్టిన పాత ఫ్రిడ్జ్ లో ఆహార పదార్థాలు నిలువ ఉంచినట్లు గుర్తించిన అధికారులు హోటల్స్ కు నోటీసులు అందించారు.

# గ్రేప్స్, ఐస్, కండోమ్స్, సాఫ్ట్ డ్రింక్స్, ఇంకా మరెన్నో.. న్యూ ఇయర్ ఆన్ లైన్ ఆర్డర్స్ ఇవే ఎక్కువట..!




**హైదరాబాద్ పెన్ పవర్:**న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ లో భాగంగా ఇండియన్స్ ఆర్డర్ చేసిన ఐటమ్స్ చూస్తుంటే మతిపోవాల్సిందే. నూతన సంవత్సరానికి గ్రాండ్ వెల్ కమ్ చెప్పే క్రమంలో.. తమకు ఇష్టమైన.. కావాల్సిన వస్తువులను నిర్మొహమాటంగా ఆర్డర్ చేశారట మన ఇండియన్స్.

ఇండియా టాప్ క్విక్ కామర్స్ సంస్థలు బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ.. తదితర సంస్థలు రివీల్ చేసిన విషయాలకు ఆశ్చర్యం వేయక మానదు. బ్లింకిట్ సీఈవో చెప్పిన వివరాల ప్రకారం చిప్స్, సాఫ్ట్ డ్రింక్స్, వాటర్ బాటిల్స్ ఎక్కువ ఆర్డర్ చేశారంట. బ్లింకిట్ సీఈఓ అల్బిందర్ ధిండ్సా, స్విగ్గీ కో ఫౌండర్ ఫని కిషన్ తదితరులు ఎక్స్ (ట్విట్టర్) లో తమ సైట్లలో చేసిన ఆర్డర్స్ పై పోస్టుల్లో తెలిపారు. డిసెంబర్ 31, 2024న రాత్రి 8 గంటలకు 2.3 లక్షల ఆలూ భుజియా ప్యాకెట్లను డెలివరీ చేసినట్లు %దీశ్రీఅఅనెఓ% నివేదించింది, అయితే %వాషఐస్త్రస్త్రఎ ×అర్ఖుఝుతీ% చిప్‌ల ఆర్డర్‌లు రాత్రి 7:30 గంటల సమయంలో నిమిషానికి 853కి చేరుకున్నట్లు తెలిపారు. సాయంత్రం కోసం సర్చ్ చేసిన వాటిలో పాలు, చిప్స్, చాక్లెట్, ద్రాక్ష, పనీర్ ఉన్నాయి.బ్లింకిట్ రాత్రి 8 గంటల సమయానికి 6,834 ఐస్ క్యూబ్‌లను డెలివరీ చేసిందట. బిగ్‌బాస్కెట్ ఐస్ క్యూబ్ ఆర్డర్‌లలో 1290% ఉన్నాయట. 7:41 గంటలకు ఐస్ క్యూబ్స్ ఆర్డర్స్119 కిలోలకు చేరుకుందట.

అయితే న్యూ ఇయర్ రోజు అత్యధికంగా టిప్ ఇచ్చింది హైద్రాబాద్ లో అని దిండా ఎక్స్ లో పోస్ట్ చేశారు. "హైదరాబాద్‌కు చెందిన ఒకరు మా డెలివరీ బాయ్ కి ఈ రోజు అత్యధిక టిప్ (₹2500) ఇచ్చారు. అత్యధిక టిప్ లు మాత్రం బెంగళూరు వచ్చాయట. మొత్తం ₹1,79,735 టిప్ న్యూ ఇయర్ కానుకగా ఇచ్చారట.

# శ్రీతేజ్ పరామర్శివంచిన మంత్రి సీతక్క

**హైదరాబాద్ పెన్ పవర్:**సంధ్యా థియేటర్ ఘటనలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆస్పత్రిలో కిత్సపొందుతున్న బాలుడు శ్రీతేజ్ ను మంత్రి సీతక్క పరామర్శించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ తో కలిసి కిమ్స్ ఆసుపత్రిని సందర్శించారు. శ్రీతేజ్ కి చికిత్స అందిస్తున్న డాక్టర్లతో మాట్లాడి శ్రీ తేజ్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితిని చూసి భావోద్వేగానికి లోనైనారు. శ్రీతేజ్ తండ్రికి ధైర్యం చెప్పాఉరు.

మంత్రి మాట్లాడుతూ సినిమా రిలీజ్ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో రేవతి మరణించడం అత్యంత దురదృష్టకరం. బాలుడు శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి కొంత మెరుగుపడింది వెంటిలేటర్ చికిత్స నుంచి శ్రీతేజ్ బయటకి వచ్చాడు. శ్రీతేజ్ కుటుంబానికి మా ప్రభుత్వం అండగా నిలుస్తోంది.

మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి ప్రత్యేక అధికారిని నియమించి శ్రీతేజ్ కు అందుతున్న చికిత్సను పర్యవేక్షిస్తున్నాం. శ్రీతేజ్ త్వరగా కోలుకుని బయటికి రావాలని కోరుకుంటున్నామని అన్నారు.

# అమెరికాలో అరాచకం : న్యూఇయర్ వేడుకల్లోకి దూసుకొచ్చిన ట్రక్.. ఆ తర్వాత తుపాకీతో కాల్పులు



**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూ ఓర్లియన్స్: అమెరికాలో న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ లో విషాదం చోటు చేసుకుంది. అమెరికాలోని న్యూ ఓర్లియన్స్‌లో సెలబ్రేషన్స్ చేసుకుంటున్న జనంపైకి వేగంగా వచ్చిన ఓ మినీ ట్రక్ దూసుకెళ్లింది. ఈ ఘటనలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. 30 మంది గాయపడ్డారు. వేకువజామున 3.15 సమయంలో ఈ ప్రమాదం జరిగింది. న్యూ ఓర్లియన్స్‌లోని బోర్బన్ స్ట్రీట్, ఇబర్ విల్లీ నైట్ లైఫ్ కల్చర్‌కు ఫేమస్. న్యూ ఇయర్ కావడంతో ఈ ఏరియాలో క్రౌడ్ మరింత పెరిగింది. హై స్పీడ్‌తో దూసుకొచ్చిన మినీ ట్రక్ ఆ జనంపైకి దూసుకెళ్లడంతో ఆ ప్రాంతమంతా ఆర్తనాదాలతో శోకసంద్రంలో మునిగిపోయింది. అంతేకాదు.. ఈ ప్రమాదానికి కారణమైన ఆ ట్రక్ డ్రైవర్ కాల్పులు జరిపినట్టు కూడా తెలిసింది. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆ వాహనం కారు కాదని ట్రక్ అని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించారు. ఈ దుర్ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పోలీసు కార్లు, అంబులెన్స్‌లతో ఆ ప్రాంతం కనిపించింది. ఈ ఘటన జరిగిన సమయంలో ఆ ప్రాంతంలో వందలాది మంది న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ చేసుకుంటున్నట్లు అక్కడున్న వారు తెలిపారు. ఎమర్జెన్సీ టీమ్స్ తక్షణమే స్పందించి ట్రాఫిక్ క్లియర్ చేశాయి.

# డిసెంబర్‌లో జీఎస్టీ వసూళ్లు రూ.1.77 లక్షల కోట్లు... వరుసగా పదో నెల రూ.1.7 లక్షల కోట్లు క్రాస్




**హైదరాబాద్ పెన్ పవర్:**జీఎస్టీ వసూళ్లు గత ఏడాది డిసెంబర్ నెలలో భారీ స్థాయిలో నమోదయ్యాయి. 2024 డిసెంబర్‌లో జీఎస్టీ వసూళ్లు రూ. 1.77 లక్షల కోట్లుగా నమోదయ్యాయని ఈరోజు కేంద్ర ఆర్థిక శాఖ డేటా వెల్లడించింది. అంతకుముందు ఏడాదితో పోల్చితే 7.3 శాతం వృద్ధి నమోదైంది. 2023 డిసెంబర్‌లో జీఎస్టీ వసూళ్లు రూ. 1.65 లక్షల కోట్లు నమోదయ్యాయి. సీజీఎస్టీ రూపంలో రూ. 32,836 కోట్లు, ఎస్‌జీఎస్టీ రూపంలో రూ. 40,499 కోట్లు వచ్చాయి. ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ కింద రూ. 91,200 కోట్లు, సెస్‌ల రూపంలో రూ. 12,300 కోట్లు వచ్చినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ డేటా వెల్లడించింది. ఇందులో దిగుమతులపై విధించిన పన్నుల నుంచి వచ్చిన రెవెన్యూ 4 శాతం పెరిగి రూ. 44,268 కోట్లుగా ఉంది. జీఎస్టీ వసూళ్లు రూ. 1.7 లక్షల కోట్లు దాటడం వరుసగా ఇది పదో నెల. మార్చి నెల నుంచి జీఎస్టీ వసూళ్లు ఈ స్థాయిని దాటుతున్నాయి. నవంబర్ నెలలో జీఎస్టీ వసూళ్లు రూ. 1.82 లక్షల కోట్లు నమోదయ్యాయి. గత ఏడాది అత్యధికంగా ఏప్రిల్ నెలలో రూ. 2.10 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లు నమోదయ్యాయి.

# ఈ బ్యాంకు ఖాతాలు మూసేస్తున్నారు.. మీ ఖాతాల్లో డబ్బులు ఉంటే వెంటనే డ్రా చేసుకోండి

**హైదరాబాద్ పెన్ పవర్:**బ్యాంక్ ఖాతాదారులకు బిగ్ అలర్ట్ అందుతోంది. కొత్త ఏడాది మొదటి రోజే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (%=దీ×%) దేశవ్యాప్తంగా లక్షలాది బ్యాంక్ ఖాతాలను ప్రభావితం చేసే కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఏళ్ల తరబడి వాడకుండా వదిలేసిన ఖాతాలను, జీరో బ్యాలెన్స్ కదా అని పైసలు ఉంచకుండా మూలాన పడేసిన ఖాతాలన్నింటినీ మూసివేయాలని నిర్ణయించింది. 2025 జనవరి 1 నుంచే ఆర్‌బీఐ దీన్ని అమలులోకి తీసుకురాబోతుంది.

బ్యాంకింగ్ లావాదేవీల భద్రత, పారదర్శకత, బ్యాంకింగ్ పనితీరును పెంపొందించే లక్ష్యంగా మూడు రకాల బ్యాంక్ ఖాతాలను మూసివేయాలని ఆర్‌బీఐ నిర్ణయించింది. తద్వారా మోసపూరిత కార్యకలాపాలను అరికట్టవచ్చని అపెక్స్ బ్యాంక్ నమ్ముతోంది. మూసేస్తున్న ఆ మూడు రకాల ఖాతాలు ఏవనేది తెలుసుకొని.. ఆయా అకౌంట్లలో మీ డబ్బులుంటే డ్రా చేసుకోగలరని మనవి.




**డోర్మాంట్ అకౌంట్స్**

డోర్మాంట్ ఖాతా అంటే.. రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం పాటు ఎటువంటి లావాదేవీలు జరగని అకౌంట్లు. మోసపూరిత కార్యకలాపాల కోసం హ్యాకర్లు.. ఇలాంటి ఖాతాలను లక్ష్యంగా చేసుకుని తమ అసాంఘిక కార్యకలాపాలను సాగిస్తుంటారు. అందువల్ల డార్మాంట్ అకౌంట్లను క్లోజ్ చేయాలని ఆర్‌బీఐ నిర్ణయించింది.

**ఇనాక్టివ్ అకౌంట్స్**

ఇనాక్టివ్ ఖాతాలు అంటే నిర్దిష్ట వ్యవధిలో (సాధారణంగా 12 నెలలు లేదా అంతకంటే ఎక్కువ) లావాదేవీ కార్యకలాపాలు అకౌంట్లు. ఖాతాల భద్రతను మెరుగుపరచడానికి, మోసపూరిత ప్రవర్తన ప్రమాదాన్ని తగ్గించే ప్రయత్నాలలో భాగంగా ఈ ఖాతాలను మూసేయాలని ఆర్‌బీఐ నిర్ణయించింది. ఒకవేళ మీకూ ఇలాంటి ఇనాక్టివ్ అకౌంట్ ఉంటే వెంటనే యాక్టివేట్ చేసుకోవడం మంచిది. ఒకసారి మూసేశాక బ్యాంకుకెళ్లి అయ్యో నా డబ్బని లబోదిబోమని ఎంత మొత్తుకున్నా చిల్లిగవ్వ తిరిగి రాదు.

**జీరో బ్యాలెన్స్ ఖాతాలు**

ఎక్కువ కాలం జీరో బ్యాలెన్స్‌ని కొనసాగించే ఖాతాలు కూడా మూసివేయాలని ఆర్‌బీఐ నిర్ణయించింది. ఇలాంటి ఖాతాలు బోలెడు ఉన్నాయి. నాలుగైదేసి అకౌంట్లు తెరవడం.. అవసరం లేని వాటిలో డబ్బులు ఉంచకుండా మూలన పడేయటం అందరూ చేసే పని. అటువంటి ఖాతాలన్నీ మూతపడనున్నాయి. ఖాతాల దుర్వినియోగాన్ని అరికట్టడం, ఆర్థిక నష్టాలను తగ్గించడం, కస్టమర్లకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించడమే లక్ష్యంగా ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది.

**మీ అకౌంట్ మూత పడకూడదు అంటే, వెంటనే ఈ పని చేయండి**

ఒకవేళ మీ ఖాతా ఇనాక్టివ్‌గా ఉన్నా, రెండేళ్లుగా ఎలాంటి లావాదేవీలు జరపక డోర్మాంట్ స్థితిలో ఉన్నా వెంటనే యాక్టివేట్ చేసుకోండి. అందుకోసం మీరు వెంటనే కేవైసీ )ని పూర్తి చేయాలి. మీ ఆధార్, పాన్ వివరాలు బ్యాంక్ సిబ్బందికి అందజేసి మీ కేవైసీని అప్డేట్ చేసుకోండి. అలా చేస్తే మీ బ్యాంకు ఖాతా ఇనాక్టివ్‌గా మారకుండా ఉంటుంది. అలాగే బ్యాంకు ఖాతాలో మినిమమ్ బ్యాలెన్స్అనేది మెయింటెన్ చేయండి. లేదంటే అవి ఇనాక్టివ్ అయ్యే అవకాశాలు లేకపోలేదు.

# డ్రగ్స్ కేసులో 8 మంది పాక్ జాతీయులకు ముంబై కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష

**2015లో గుజరాత్ తీరంలో హెరాయిన్‌ను తరలిస్తూ పట్టుబడిన పాక్ జాతీయులు**

**20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.2 లక్షల జరిమానా విధింపు**

**శిక్షను ఖరారు చేసిన ముంబై ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి**



**హైదరాబాద్ పెన్ పవర్:**2015లో దాదాపు రూ.7 కోట్ల విలువైన 200 కిలోల డ్రగ్స్ కేసులో పట్టుబడిన ఎనిమిది మంది పాక్ జాతీయులకు ముంబై కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. డ్రగ్స్ నిరోధక చట్టం కింద ఎనిమిది మందిని ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి దోషులుగా నిర్ధారించారు. వారికి గరిష్ఠంగా 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.2 లక్షల జరిమానా విధించారు.

2015లో గుజరాత్ తీరంలో హెరాయిన్‌ను తరలిస్తున్న పడవను భారత కోస్ట్ గార్డ్ అధికారులు పట్టుకున్నారు.

అందులో 11 డ్రమ్ములు, 20 ప్లాస్టిక్ ప్యాకెట్లలో పొడిని గుర్తించారు.

ప్యాకెట్లలోని పదార్థాన్ని హెరాయిన్‌గా తేల్చారు. దీనికి సంబంధించి ఎనిమిది మంది పాక్ జాతీయులను అరెస్ట్ చేశారు. వారితో పాటు మూడు శాటిలైట్ ఫోన్లు, జీపీఎస్ నావిగేషన్ చార్ట్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను సీజ్ చేశారు. ఆ తర్వాత నిందితులను దక్షిణ ముంబై పోలీసులకు అప్పగించారు. ఈ కేసులో నిందితులకు గరిష్ఠంగా శిక్ష విధించాలని, అప్పుడే ఇలా డ్రగ్స్ అక్రమ రవాణాదారులకు హెచ్చరిక అవుతుందని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టును కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న జడ్జి ఈరోజు కేసులో దోషులకు శిక్షను ఖరారు చేశారు.

# ప్రపంచంలో ఎక్కువ జీతం తీసుకుంటున్నది ఎవరంటే..!

**అత్యధిక వేతనం అందుకుంటున్నది భారతీయుడే**

**క్వాంటం స్కేప్ వ్యవస్థాపకుడు జగ్దీప్ సింగ్ వార్షిక వేతనం రూ. 17,500 కోట్లు**

**రోజుకు రూ. 48 కోట్లు అందుకుంటున్న జగ్దీప్ సింగ్**



**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రపంచంలో ఎక్కువ జీతం తీసుకునే వ్యక్తి ఎవరనే సందేహం చాలా మందిలో ఉంటుంది. 'అన్ స్టాప్' అనే సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచంలో ఎక్కువ వేతనం పొందుతున్నది భారతీయుడే కావడం మనకు గర్వకారణం. 'క్వాంటం స్కేప్' వ్యవస్థాపకుడు, సీఈవో జగ్దీప్ సింగ్ ప్రపంచంలోనే అత్యధిక వేతనాన్ని అందుకుంటున్నారు. జగ్దీప్ సింగ్ నెలవారీ జీతం రూ. 1,458 కోట్లు... వార్షిక జీతం రూ. 17,500 కోట్లుగా ఉంది. అంటే ఒక రోజుకు రూ. 48 కోట్లు ఆయన అందుకుంటున్నారన్నమాట. జగ్దీప్ సింగ్ అమెరికాలోని స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీ నుంచి బీటెక్ పూర్తి చేశారు. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం నుంచి ఎంబీఏ పట్టా పొందారు. క్వాంటం స్కేప్ కంపెనీని స్థాపించక ముందు వివిధ కంపెనీల్లో కీలక పదవుల్లో పని చేశారు.

# భారతదేశంలో పౌరులకు అందే అత్యుత్తమ పురస్కారం భారతరత్న

## -భారతరత్న పురస్కారం స్థాపించబడింది ఈరోజే (జనవరి 2, 1954)

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

భారతరత్న పురస్కారం భారతదేశంలో పౌరులకు అందే అత్యుత్తమ పురస్కారం. ఇది జనవరి 2, 1954లో భారతదేశ మొదటి రాష్ట్రపతి డా. రాజేంద్ర ప్రసాద్ చేత స్థాపించబడింది. ఈ పౌర పురస్కారం కళ, సాహిత్య, విజ్ఞాన, క్రీడా రంగాలలో అత్యుత్తమ కృషికి ప్రదానం చేస్తారు. ఇప్పటివరకు నలభై మందికి ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. వారిలో ఇద్దరు విదేశీయులు కూడా ఉన్నారు. ఈ పురస్కారం 1977 జూలై 13 నుండి 1980 జనవరి 26 వరకు జనతా పార్టీ పాలనలో కొద్దికాలం పాటు నిలిపివేయబడింది. ఒకే ఒక్కసారి 1992లో సుభాష్ చంద్రబోస్కు ఇవ్వబడిన పురస్కారం చట్టబద్ధ సాంకేతిక కారణాల వల్ల వెనుకకు తీసుకొనబడింది.

ఎలాంటి జాతి, ఉద్యోగం,స్థాయి లేదా స్త్రీ పురుష వ్యత్యాసం లేకుండా ఈ పురస్కారం ఇవ్వబడుతుంది. ఈ పురస్కారగ్రహీతల జాబితాను ప్రధానమంత్రి రాష్ట్రపతికి సిఫారసు చేయవలసి ఉంటుంది.




భారతరత్న పొందిన పౌరులకు 7వ స్థాయి గౌరవం లభిస్తుంది (మొదటిది ఆరూ– రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, రాష్ట్ర గవర్నర్లు, మాజీ రాష్ట్రపతులు, ఉపప్రధాన మంత్రి, ముఖ్య న్యాయాధీశులు). కానీ ఈ గౌరవం వలన ఎలాంటీ అధికారాలు లేదా పేరు ముందు ప్రత్యేక బిరుదులూ రావు.

ఈ పురస్కారం పొందిన విదేశీయుల జాబితాలో సరిహద్దు గాంధిగా పేరుపొందిన ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ (1987), నెల్సన్ మండేలా (1990) ఉన్నారు.

1954, జనవరి 2వ తేదీన రెండు పౌర పురస్కారాలను ప్రారంభిస్తున్నట్లు భారత రాష్ట్రపతి యొక్క కార్యదర్శి కార్యాలయం నుండి ఒక ప్రకటన జారీ అయ్యింది. వాటిలో మొదటిది అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న కాగా రెండవది దానికన్నా తక్కువ స్థాయి గల మూడంచెల పద్మవిభూషణ్ పురస్కారం. పద్మవిభూషణ్ పురస్కారం ప్రథమ, ద్వితీయ, తృతీయ వర్గాలుగా విభజించారు. 1955, జనవరి 15న పద్మవిభూషణ్ పురస్కారాన్ని పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ అనే మూడు వేర్వేరు పురస్కారాలుగా పునర్వర్గీకరించారు.

భారతరత్న పురస్కారం కేవలం భారతీయులకే ప్రదానం చేయాలన్న నిబంధన ఏమీ లేదు. ఈ పురస్కారాన్ని భారత పౌరసత్వం స్వీకరించిన మదర్ థెరీసాకు 1980లో, మరో ఇద్దరు విదేశీయులు ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్కు 1987లో, నెల్సన్ మండేలాకు 1990లో ప్రదానం చేశారు. ప్రఖ్యాత క్రికెట్ క్రీడాకారుడు సచిన్ టెండూల్కర్కు తన 40వ యేట ఈ పురస్కారం లభించింది. ఈ పురస్కారం లభించినవారిలో ఇతనే అతి పిన్నవయస్కుడు, మొట్టమొదటి క్రీడాకారుడు. సాధారణంగా భారతరత్న పురస్కార ప్రదాన సభ రాష్ట్రపతి భవన్, ఢిల్లీలో జరుగుతుంది. కానీ 1958, ఏప్రిల్ 18వ తేదీన బొంబాయిలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ధొండొ కేశవ కర్వేకు అతని 100వ జన్మదినం సందర్భంగా ఈ పురస్కారాన్ని అందజేశారు. ఇతడు జీవించి ఉండగా ఈ పురస్కారం అందుకున్నవారిలో అతి పెద్ద వయస్కుడు. 2015 నాటికి ఈ పురస్కారాన్ని మొత్తం 45 మందికి అందజేయగా వారిలో 12 మందికి మరణానంతరం లభించింది.

చరిత్రలో ఈ పురస్కారం రెండుసార్లు రద్దు చేయబడింది. మొదటి సారి మొరార్జీ దేశాయ్ ప్రధానమంత్రిగా గద్దెనెక్కిన తర్వాత 1977, జూలై 13వ తేదీన అన్ని పౌరపురస్కారాలను రద్దుచేశారు. తరువాత ఈ పురస్కారాలు 1980, జనవరి 25న ఇందిరాగాంధీ ప్రధాన మంత్రి అయిన తర్వాత పునురుద్ధరించబడ్డాయి. 1992లో ఈ పురస్కారాల "రాజ్యాంగ సాధికారత"ను సవాలు చేస్తూ కేరళ, మధ్యప్రదేశ్ హైకోర్టులలో రెండు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు కావడంతో ఈ పురస్కారాలను రెండవసారి రద్దు చేశారు. ఈ వ్యాజ్యాలకు ముగింపు పలుకుతూ 1995 డిసెంబరులో సుప్రీం కోర్టు ఈ పురస్కారాలను మళ్ళీ పునరుద్ధరించింది. ఇప్పటివరకు 54 మందికి భారతరత్న అవార్డు ప్రధానం చేశారు.

# సిద్ధివినాయక జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి హరీష్ రావు

**హైదరాబాద్ పెన్ పవర్:**స్వయంభూ సిద్ధివినాయక 225వ జయంతి ఉత్సవాల్లో రేజింతల్ వినాయక ఆలయానికి మాజీమంత్రి హరీష్ రావు వచ్చారు. అయనకు ఆలయ పాలకమండలి సభ్యులు . ఘన స్వాగతం పలికారు. తరువాత అయన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

హరీష్ రావు మాట్లాడుతూ జహీరాబాద్ నియోజకవర్గం రేజింతల్ లో స్వయంభూ సిద్ధి వినాయక 225 జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నందుకు చాలా సంతోషంగా ఉంది. సిద్ధి వినాయకుడు దినదినము ఆకారం పెంచుకుంటూ ఇక్కడికి వచ్చే భక్తుల కోరికలు నెరవేరుస్తూ వస్తున్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక మహారాష్ట్ర, ఆస్ట్రేలియా నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఇక్కడికి వచ్చి స్వామి దర్శనం చేసుకుంటున్నారు. గతంలో కేసీఆర్ ఆశీస్సులతో ఆలయాన్ని అభివృద్ధి చేయడం జరిగింది. ప్రతి సంవత్సరం సిద్ధి వినాయక జయంతి ఉత్సవాలు గొప్పగా జరగడం సంతోషకరమైన విషయం. స్వామివారి పుష్పార్చన కార్యక్రమంలో పాల్గొనడం మరింత సంతోషం, ఆనందాన్ని కలిగించింది. సిద్ధి వినాయకుడి దర్శనానికి వస్తున్న భక్తుల సంఖ్య కూడా రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. ఇలాంటి విశిష్టత ఉన్న సిద్ధి వినాయకుడిని మరెక్కడా మనం చూసి ఉండము. ప్రతి సంవత్సరం నేను జయంతి ఉత్సవాల్లో పాల్గొంటానని అన్నారు.

## రైల్వే ప్రయాణ వేళల్లో మార్పులు

**సికింద్రాబాద్ పెన్ పవర్:** దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని పలు రైళ్ల ప్రయాణ వేళల్లో మార్పులు చోటు చేసుకున్నాయి . ఈ మేరకు ట్రైన్ టైమింగ్స్, నెంబర్ల మార్పుపై సౌత్ సెంట్రల్ రైల్వే ప్రకటన విడుదల చేసింది. ఈ మార్పులు జనవరి 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని వెల్లడించింది. రైల్వే సర్వీసులను మరింత మెరుగుపరి చేందుకు, ప్రయాణికులకు బెస్ట్ సర్వీసెస్ అందించేందుకు ఈ మార్పులు చేసినట్లు పేర్కొంది. దాదాపు 94 రైళ్ల టైమింగ్వస్ లో మార్పులు చేసింది. ఇందులో విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్లాల్సిన రత్నాచల్ ఎక్స్ప్రెస్ సైతం ఉంది. విజయవాడ స్టేషన్లో ఇక నుంచి 15 నిమిషాలు ముందుగానే రత్నాచల్ ఎక్స్ప్రెస్ బయలుదేరుతుంది. పాత షెడ్యూల్ ప్రకారం విజయవాడ రైల్వే స్టేషన్లో ఉదయం 6.15 గంటలకు బయలుదేరాల్సిన ట్రైన్, మార్చిన షెడ్యూల్ ప్రకారం ఉదయం 6 గంటలకే బయలుదేరనుంది. నిత్యం విజయవాడ నుంచి విశాఖ వెళ్లే ప్రయాణికులు భారీ సంఖ్యలో రత్నాచల్ ట్రైన్లో ప్రయాణిస్తుంటారు. ఈ మార్పులను ప్రయాణికులు గమనించాలంటూ దక్షిణ మధ్య రైల్వే సూచించింది. అదే విధంగా మరిన్ని ట్రైన్లలో కూడా మార్పులు చోటుచేసుకున్నాయి.

## మెరుగుమాల కాళీకి ఆసుపత్రిలో పరీక్షలు

**గుడివాడ పెన్ పవర్:** కొడాలి నాని ప్రధాన అనుచరుడు మెరుగుమాల కాళీని పోలీసులు ఆస్పత్రికి తరలించారు. గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం కాళీని కోర్టుకు తరలించారు. గుడివాడ టీడీపీ కార్యాలయం, రావి వెంకటేశ్వరరావుపై దాడిలో కాళీ కీలక సూత్రధారిగా ఉన్నాడు. పరారీలో ఉన్న కాళీని నిన్న అస్సాంలో పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే.

## సీఎం చంద్రబాబును ఆశీర్వదించిన తిరుమల అర్చకులు

**హైదరాబాద్ పెన్ పవర్:**నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును తిరుమల తిరుపతి దేవస్థాన అర్చకులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా టీటీడీ క్యాలెండర్, డైరీ, స్వామివారి చిత్రపటాన్ని సీఎం చంద్రబాబుకు ఈఓ శ్యామలరావు అందజేశారు.

## కొంపల్లి రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

**హైదరాబాద్ పెన్ పవర్:** కొంపల్లి లోని పలు రెస్టారెంట్లలో బుధవారం నాడు ఫుడ్ సేఫ్టీ అధికారులు విస్తృత తనిఖీలు చేశారు. కొంపల్లి మునిసిపల్ పరిధిలోని రెస్టారెంట్ లు ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించట్లేదన్న ఆరోపణలతో అధికారులు తనిఖీలు చేయగా , నాన్ వెజ్ ఐటమ్స్ లో ఫుడ్ కలర్స్ కలిపినట్టు , కుళ్లిపోయిన టమాటాలు వాడుతున్నట్లు , కిచెన్ పరిసరాలు పూర్తిగా అపరిశుభ్రంగా ఉన్నాయని ఫుడ్ సేఫ్టీ అధికారులు అన్నారు. కిచెన్ లో బొద్దింకలు ఉన్నట్టు గుర్తించారు. వారి పై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు

# మళ్లీ యాక్టివ్ గా హైడ్రా...

**హైదరాబాద్, జనవరి 1, పెన్ పవర్:** హైడ్రా మరోసారి కూల్చివేతలు చేపట్టింది. తన పరిధిలో చెరువులు, కుంటల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే.. నిబంధనలు, అనుమతులు అంటూ కాలయాపన చేయకుండా ప్రజా ఆస్తుల్ని, ప్రకృతి వనరుల్ని కాపాడుకునేందుకు తక్షణమే రంగంలోకి దిగుతుంది. ఈ క్రమంలోనే హైడ్రా తాజాగా శేరిలింగం పల్లిలో అక్రమ నిర్మాణాలపై దృష్టి పెట్టింది. ఇక్కడి భగీరథమ్మ, తౌతానికుంట చెరువుల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలపైకి బుల్డోజర్లను పంపింది. హైదరాబాద్ నగర నిర్మాణం, అభివృద్ధితో పాటు ఇక్కడ ప్రకృతి సంపదల్ని.. తరాల పాటు ప్రజల అవసరాల్ని కాపాడేలా చేపట్టిన చర్యల్లో హైడ్రాకు ప్రత్యేక స్థానం ఉంటుంది. విశేష అధికారాలు, ప్రభుత్వ పూర్తి అండదండలతో తమపర భేదం లేకుండా.. ఎక్కడ తప్పు జరిగితే అక్కడ హైడ్రా ప్రత్యక్షమవుతోంది. తనకు కేటాయించిన బాధ్యతల్ని తూ.చా తప్పకుండా ఎలాంటి రాజకీయ, ఇతర ఒత్తిళ్లకు లొంగకుండా పనిచేసుకుంటూ పోతుంది. అందులో భాగంగా.. కొత్త ఏడాది వేడుకలకు ముందు సైతం తన పవర్ చూపిస్తోంది. చెరువులు, కుంటల జోలికి వస్తే ఊరుకునేది లేదని తేల్చి చెబుతోంది. శేరిలింగంపల్లి మండలంలో పరిధిలోని ఖాజాగూడ ? నానక్ రామ్ గూడ ప్రధాన రహదారికి ఇరువైపులా భగీరథమ్మ, తౌతానికుంట చెరువులు ఉన్నాయి. ప్రస్తుతం అక్కడ రియల్ ఎస్టేట్ రంగం



ఊహించని రీతిలో పుంజుకుని పరుగులు తీస్తోంది. అందుకే.. అక్రమార్కుల కళ్లు.. ఈ చెరువులపై పడ్డాయి. దాంతో.. రేకులతో ఆ స్థలాలను తమవిగా చెప్పుకుండా అడ్డుగోడ కట్టేశారు. దాంతో.. రంగంలోకి దిగిన హైడ్రా వెంటనే కూల్చివేతలు చేపట్టింది. ఈ చెరువుల భూముల్ని అక్రమంగా ఆక్రమించుకుంటున్నారని.. స్థానికులు ఫిర్యాదుల చేయడంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ గతవారంలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఫిర్యాదు అందిన ప్రాంతంలో చెరువుల భూముల్లోనే నిర్మాణాలు చేపడుతున్నట్లు గుర్తించారు. చెరువుల ఫుల్ ట్యాంక్ లెవెల్, బఫర్ జోన్లలో ఆక్రమణలు జరిగినట్లు అధికారులు నిర్ధరించారు. దాంతో.. రంగంలోకి దిగిన హైడ్రా మంగళవారం నాడు కూల్చివేతలు చేపట్టింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో ప్రొక్లేన్ సాయంతో అక్కడి చేరుకున్న ప్రభుత్వ సిబ్బంది.. 10 ఆక్రమణలను కూల్చివేశారు. రేకుల షెడ్లతో పాటు రేకుల ప్రహరీ నిర్మించి ఆక్రమణలు చేసినట్లు గుర్తించిన అధికారులు.. వాటిని పూర్తిగా కూల్చివేశారు. నోటీసులు అందజేసిన తర్వాత కూల్చివేతలు ప్రారంభించిన అధికారులు.. కూల్చివేతలతో 10 ఎకరాల వరకు ప్రభుత్వ, చెరువు భూముల స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు. ఈ కేసులో అక్రమణలకు పాల్పడిన వారిని గుర్తించి కేసులు నమోదు చేయనున్నట్లు హైడ్రా అధికారులు తెలిపారు. అక్రమణలపై నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజల నుంచి స్వచ్ఛందా అనేక ఫిర్యాదులు అందుతున్నాయి. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతనే కూల్చివేతలకు పాల్పడుతున్నారు. పక్కా సమాచారం, సాంకేతిక ఆధారాలను దగ్గర పెట్టుకుని కూల్చివేతలు చేపడుతున్నారు. నూతన ఏడాది వేడుకలకు ముందు హైడ్రా దూకుడుతో ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, కుంటల్ని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టిన వారికి కంటి మీద కునుకు ఉండటం లేదు. ప్రారంభంలోనే ఇలా ఉంటే రానున్న రోజుల్లో హైడ్రా మరింత దూకుడుగా ముందుకు వెళ్లే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి పట్టుదల, చెరువుల్ని రక్షించాలనే సంకల్పంతో.. అక్రమార్కులపై మరిన్న చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి. అలాగే.. త్వరలోనే ప్రత్యేక పోలీస్ స్టేషన్లు సైతం రానుండడంతో హైడ్రాకు ప్రత్యేక అధికారాలు రానున్నాయి.

## బర్త్ డే పార్టీకి అని పిలిచారు దారుణంగా హత్య చేశారు

**సూర్యాపేటపెన్ పవర్:** మంగళవారం రాత్రి చివ్వెంల మండలం లో దారుణ హత్య జరిగింది. లక్ష్మీ నాయక్ తండాకు చెందిన ధరావత్ శేషు (35)ని సమీప బంధువులు బర్త్ డే, న్యూ ఇయర్ వేడుకలను సెలబ్రేట్ చేసుకుందామని పిలిచారు. కానీ శేషును పార్టీ పేరుతో పిలిచిశ్రీరాం నగర్ కాల్వ మీదుకు తీసుకెళ్లి దారుణంగా గొంతు కోసి హత్య చేశారు. హతుడు సూర్యాపేట జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అంబులెన్స్ డ్రైవర్ గా పని చేస్తున్నాడు. అయితే ఆ రెండు కుటుంబాలకు గత కొన్నాళ్లుగా భూతగాదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు అర్ధరాత్రి హుటాహుటిన లక్ష్మీ నాయక్ తండాకు చేరుకోని భారీ బందోబస్త్ ఏర్పాటు చేశారు. ఇరు వర్గాల మధ్య అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టడి చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని సూర్యాపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మార్చరీకి తరలించారు.

## యువకుని పై నూతనకల్ పోలీసుల అత్యుత్సాహం

### విచక్షణారహితంగా చితకబాదిన కొట్టిన ఇద్దరు కానిస్టేబుల్,ఎస్సై

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంటి ముందు నిలుచున్న కటురి రాము వ్యక్తిని ఇద్దరు కానిస్టేబుళ్లు ఇక్కడ ఎందుకు నిలబడ్డావు అంటే మా ఇంటి దగ్గర నిలబడ్డాను అని సమాధానం ఇచ్చాడు. దాంతో కానిస్టేబుల్లు మండిపడ్డారు. సదరు వ్యక్తిని పోలీస్ జీప్ లో తీసుకొచ్చి పోలీస్ స్టేషన్లో విచక్షణారహితంగా చితకబాదిన సంఘటన నూతనకల్ మండల కేంద్రంలో జరిగింది. ఈ విషయాన్ని ఆ నోట ఈ నోట పడడంతో రాజకీయ నాయకులు రంగ ప్రవేశం చేసి జిల్లా ఉన్నతాధికారులకు వెళ్లనివ్వకుండా ఆపుతున్నట్లు సమాచారం. వెంటనే ఇద్దరు కానిస్టేబుకు , ఎస్ఐపై చర్య తీసుకోవాలని బాధితుడు కోరుతున్నాడు...

## ఇదేం గలీజు పని.. హైదరాబాద్‌లో ఉప్పల్ సైడ్ ఉండేటోళ్లు.. సూడండి.!

**హైదరాబాద్ పెన్ పవర్:** బీర్, విస్కీ బాటిల్స్ తో ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్ డంపింగ్ యార్డును తలపించింది. చెత్తాచెదారంతో, బీరు సీసాల కేసులతో నిండిపోయింది. న్యూ ఇయర్ వేడుకల కోసం డ్రైవ్ ఈవెంట్స్‌కు మున్సిపల్ అధికారులు గ్రౌండ్ ను రెంట్‌కు ఇచ్చారు. డిసెంబర్ 31న రాత్రి వేడుకల్లో భాగంగా పార్టీని ఎంజాయ్ చేయడానికి వెళ్లిన వాళ్లంతా తెగ తాగేశారు. ఖాళీ బీర్ బాటిళ్లు, విస్కీ బాటిళ్లు, వాటర్ బాటిల్స్‌ను గ్రౌండ్‌లో చెల్లాచెదురుగా పడేశారు. ఈవెంట్ నిర్వాహకులు పార్టీ అయిపోగానే గ్రౌండ్‌ను క్లీన్ చేయించకుండా వెళ్లిపోయారు. దీంతో ఆ ఖాళీ బీర్ బాటిల్స్, విస్కీ బాటిల్స్‌తో ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్ అపరిశుభ్రంగా తయారైంది. ప్రతీ రోజు ఉదయం వందల సంఖ్యలో మున్సిపల్ గ్రౌండ్‌కు వాకర్స్ వెళుతుంటారు. జనవరి 1, 2025న ఉదయం రోజులానే వాకర్స్ వాకింగ్ కు వెళ్లారు. గ్రౌండ్‌లో చూస్తే ఏముంది.. అంతా చెత్తచెత్తగా ఉంది. తాగి పడేసి ఉన్న బాటిల్స్ చూసి వాకర్స్ షాక్ అయిపోయారు. గ్రౌండ్‌లో పగిలిపోయిన బాటిల్స్ ఉన్నాయని.. వాకింగ్ ఎలా చేయాలంటూ తిరిగి వెళ్లిపోయారు. మున్సిపల్




అధికారులు పట్టించుకోకపోవడం వల్లనే ఇలా జరిగిందని వాకర్స్ ఆరోపించారు. ఈవెంట్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక్క ఉప్పల్ ఏరియాలోనే కాదు హైదరాబాద్‌లోని చాలా చోట్ల న్యూ ఇయర్ ఈవెంట్స్ గ్రాండ్‌గా జరిగాయి. పార్టీల్లో మద్యం ఏరులై పారింది.

జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్ సిటీతో పాటు ఇతర ప్రాంతాల్లో నిర్వహించిన స్పెషల్ ఈవెంట్లల్లో యూత్ పాల్గొని ఎంజాయ్ చేశారు. ఫ్రెండ్స్ తో కలిసి ఉర్రూతలూగించే పాటలకు హుషారుగా డ్యాన్సులు చేశారు. కస్టమర్లతో బేకరీలు, స్వీటు షాపులు, రెస్టారెంట్లు కిటకిటలాడాయి. లిక్కర్ షాపులు, వైన్స్ వద్ద మందుబాబులు బారులు తీరి కనిపించారు. సుచిత్రలోని మై ఫ్రెండ్ సర్కిల్ రెస్టారెంట్ ముందు అర కిలోమీటరు మేర ఫుడ్ డెలివరీ బాయ్స్, బిర్యానీ ప్రియులు క్యూ కట్టారు. ఓఆర్ఆర్, పీవీ ఎక్స్ ప్రెస్ వే పైకి హెవీ వెహికల్స్ మినహా కార్లను అనుమతించలేదు.